# విభిన్న దృక్పథం ★

రచయిత :
శ్రీ యర్రమిల్లి చలపతిరావు

సందుమలుపు తిరుగుతూంటే వినిపించిందా పిలుపు. ఏదో అవ్యక్త మధురగాన తరంగాలు. మార్గాన్నపోయే సంగీతప్రియుణ్ణి ఆకర్షించి నిలబెట్టినట్టూ, కాలగర్భంలో కలిసిపోయిన తరతరాలనాటి "మధురస్మృతులు" ఒక్కసారిగా మానసవీధిలో విహరించినట్టూ అయింది కుమార్‌కి. ఎవరా? అని వెనక్కి తిరిగిచూశాడు. ఎక్కడో చూచిన ముఖమే. కాని జ్ఞాపకంలేదు. ఒక్కక్షణం ఆలోచించాడు. అయిదు క్యాలెండర్లు అతని మానసిక నేత్రంలో వరసగా పరుగెత్తాయి. అప్పటి మధురమయ ఘట్టాలన్నీ ఒక్కసారి సింహావలోకనం చేశాడు. ఆమె వడిగావచ్చి "నమస్తే కుమార్! జ్ఞాపకం ఉన్నానా!" అంది.

"అనూరాధ కాదూ? అన్నాడు కుమార్ చిరునవ్వుతో, చాలా మారిపోయేవే? ఎన్నాళ్ళయిందివచ్చి? ఒంటరిగానా? లేక......

ఒంటరిగానే. ఆయనకి రాంచీ నుంచి అలహాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. నాకు శరీరంలో అస్వస్థతగావుంటంవల్ల, కొన్నాళ్ళు స్వగ్రామంలో ఉండి, మందు పుచ్చుకోమని డాక్టర్ సలహా ఇవ్వడంవల్లా, ఆయన ఓ ఐదారునెల్లు ఇక్కడే ఉండమని నన్ను పంపేసారు.

"ఓహో అదా! ఇంతకీ జబ్బేమిటి?"

"జబ్బుకల్లా ఏముంది? ఒంట్లో తగినంత రక్తం లేదు. అంచేత అప్పుడప్పుడు ఉన్నట్టుండి, ఎంతో ఆయాసమూ, నిస్త్రాణా, కనుగుతూంటుంది. బలానికి మంచి మందు పుచ్చుకుంటూ, ఆహారం పూర్తిగా మార్చి, పాలూ, ఆకుకూరలూ, పెరుగూ, తీసుకోమన్నాడు డాక్టర్" వాటికేంగానీ, ఇప్పుడేంచేస్తున్నావు కుమార్? ఇంకా మ్యారేజి చేసుకోలేదూ."

"లేదు అనూరాధా? పెళ్ళిచేసుకోలేదు. ఉద్యోగమూ చెయ్యటంలేదు. ఉద్యోగం లాంటిదే ఓ చిన్నపని, ఇక్కడ పత్రికాఫీసులో సహాయసంపాదకుడుగా చేస్తున్నాను"

"కుమార్, తొందరపనుంది. ఓ గంటలో మీఇంటికి వస్తాను. మీ అమ్మగార్ని చూసి కూడా, చాలారోజులైంది" అంటూ ఆమె చకచకా నడచివెళ్ళిపోయింది. కుమార్ అలాగే నిలబడి చూస్తూ "ఎంత చలాకీ అయిన పిల్ల?" అనుకున్నాడు. అంతులేని



భావాలు అతని హృదయంలో సుడులు తిరిగాయి. అయిదు దీర్ఘవర్షాలనాటి ఆ అనూరాధ, గ్రామనగరం ఎవరి పెళ్ళికో వెళ్లాడు. అప్పుడు తనకి చాలా చిన్నతనం. స్కూల్ ఫైనల్ చదివేరోజులు. ఆ పెళ్ళిలోనే తనకీ అనూరాధకీ స్నేహం ఏర్పడింది. నాలుగో నాడు నాగవల్లి. పిల్లలంతా బుక్కాగుండ ఒకళ్ళమీద ఒకళ్ళు జల్లుకుంటున్నారు. వసంతము చెంబుల్తో ఒకళ్ళ నెత్తిమీద ఒకళ్ళు దిమ్మరించుకుంటూన్నారు. ఏమరుపాటుగా ఉన్న తనమీద చెంబుడు వసంతం, దిమ్మరించి, చప్పట్లుకొడుతూ, పరుగెత్తింది అనూరాధ. అతనికి ఒళ్ళు మండిపోయింది. వెనకాలే పరుగెత్తాడు పట్టుకుందామని కాని దొరకలా. ఇళ్లూ, దొడ్లూ, అన్నీ తిప్పించి ఆఖరికి గడ్డివాములో దాక్కుంది. వెనకాలే వెళ్ళి, రెండు బుజాలు పట్టుకుని ఆమెను అమాంతంగా పయికెత్తి తనలో లీనంచేసుకొని "ఎవగమ్మాయివి? అంటూ ముద్దెట్టుకున్నాడు. ఆమె కప్పుడు భయమూ సిగ్గూ కలిగి జాలిగా చూచింది. కుమార్‌కి ఎంతో జాలివేసి ఆమె రెండు లెంపలమీదా మృదువుగా వాయించి "అల్లరిపిల్లా! ఇంకెప్పుడూ ఇలాంటి పని చేయకేం" అన్నాడు. ఆమె తుర్రుమని పారిపోయింది.

మర్నాడు సాయంత్రం, తను జామ చెట్టెక్కి కాయలను కోసుకుంటూంటే, ఆమె క్రింద నిలబడి "నాకో కాయి పడెయ్యవూ? అని అడిగింది.

"పడేస్తే ఏమిస్తావ్?" అన్నా డతను. "ఏం కావాలీ?" అందామె. "ఏమక్కర్లేదు

ఒక్క ముద్దు!” అన్నాడు—“మంచివాడివే!” అంటూ ఆమె ఒక్క గెంతేసి పారిపోతూ, “ఉండు నీ సంగతి మా అమ్మావాళ్ళతో చెప్పకపోతే” అంది. ఆ మర్నాడు ఆమె నూతిదగ్గర నీళ్ళుతోడుకొంటూ ఉండగా వెళ్ళి కొంచెం మంచినీళ్ళు పొయ్యి అంటూ దోసిలిపట్టాడు. “నీకు మంచినీళ్ళు కూడా పొయ్యాలీ” అంటూనే ఆమె దోసిట్లో చాల్చితో నీళ్ళుపోసింది. రెండు దోసిళ్ళు త్రాగి మూడో దోసిలినిండా నీళ్ళుపట్టి అమాంతంగా ఆమె ముఖంమీద పోసేశాడు. ఆ దెబ్బతో గౌనంతా తడిసిపోగా ముఖం చిన్నబుచ్చుకుని, చరచరా వెళ్ళిపోయింది. తను పకపకా నవ్వుతూ చప్పట్లుకొడుతూ, వెనకాలే వెంబడించాడు.

అప్పట్నించీ ఆమె మొఖం ముడుచుకుని తన్ని ఎక్కడచూసినా సరే, అంకకుండా తప్పించుకుని పారిపోయింది. అనూరాధ! ఎర్రగా, పొడుగ్గా, చెంపకు చేరడేసికళ్ళూ, చంద్రబింబంలాంటి ముఖం, ఆ మాటల్లోని, మృదుత్వం, ఆ నడకలోని చలాకీ, ఆ సిల్కు పరికిణీ, జాకట్టూ, ఆమెనుగురించి అప్పుడే అతడెన్నో తియ్యనికలలు గన్నాడు. మానసాకాశవీధిలో ఎన్నో గాలిమేడలు నిర్మించాడు. కాని, ఇంకా పొట్టలయినా పగలని విడవడానికి సిద్ధంగానున్న చెంగల్వ మొగ్గ. ముట్టుకుంటే నలిగిపోయే శిరీష కుసుమం. చేతికందని ఉన్నతశాఖయొక్క సంపంగి పూవు. తను తొందరపడి యేంచేసినా, అది ఆ అమాయకపుపిల్ల జీవితాన్నంతా ధ్వంసం చేసేస్తుంది అని కుమార్ బాగా ఆలోచించుకొన్నమీదటనే, తనలో రేగిన ఆ దుమారాన్ని చాలా మటుకు నిరోధించాడు. మొత్తానికి మంచి చలాకీ అయిన పిల్ల. మరి భర్త ఎలాంటి వాడో? నిజంగా ఆమెను భార్యగా పొందగలిగినందుకు అతడెంతయినా గర్వించాల్సిన విషయం. చేసుకున్నా, అలాటిపిల్లనే పెళ్ళి చేసుకోవాలి. అప్పుడే ఆయువకుని జీవితంలో ఆకలిదప్పులుండవు. అప్పుడే ఆ సంసారం పుష్పితనందనవనంలాగుంటుంధి. ఆ యువతీ, యువకులు ప్రేమాకాశంలో రెక్కలు గట్టుకొని ఎగిరిపోగలరు. మేఘాల్లోనూ, చంద్రుడిలోనూ, నక్షత్రాల్లోనూ, మెరపుతీగల్లోనూ దూరి వాటివాటి ఉత్సాహాదులు పరిశోధించగలరు. వాళ్ళే ధన్యులు, అమరజీవులు అనుకున్నాడు కుమార్. తిన్నగా నడుస్తూ ఆనాటి సంగతులు చింతిస్తూ ఇంటికి చేరుకొన్నాడు.

కుమార్ భోంచేస్తూండగానే అనూరాధ వచ్చింది. మొదట్లో కాస్త విస్తుపోయినా, రామ్మా, అలా కూర్చో అంటూ ఆహ్వానించింది కుమార్ తల్లి. భోంచేస్తూన్న కుమార్‌కి ఎదురుగా కూర్చుంది అనూరాధ. “ఏమండీ! అత్తయ్యగారూ? మీ కుమార్ ఇంకా పెళ్ళి చేసుకోడేమిటండీ? ఎంతకాలం అలా వుండిపోతాడు బ్రహ్మచారిగా?” అంది అనూరాధ జ్ఞానేశ్వరివంకచూస్తూ. “ఏమోనమ్మా! వాడి తత్వం నాకేం అర్థమువడంలేదు. ఎంతచెప్పినా పెళ్ళిచేసుకోనంటాడు. తోటివాళ్లంతా పెళ్ళిచేసుకొని పిల్లలతండ్రులయారు. ఉద్యోగం చెయ్యకపోతే గడవదని బెంగలేదు గాని, పెళ్ళయినా చేసుకోమని ఎంత బతిమాలినా చేసుకోనంటాడు. వాడి పుస్తకాలేమిటో? వాడేమిటో? ఎంతసేపూ ఏవో పుస్తకాలు చదువుతూంటాడు. నేనయినా పెద్దదాన్నయాను. ఇంకా ఎంతకాలం ఈ చాకిరీ చెయ్యగలను చెప్పు. నువ్వేనా కాస్తచెప్పు” అంది జ్ఞానేశ్వరి. ఆమె మాటల్లోని నిరాశ, ఆవేదన, ఆ మాతృహృదయంయొక్క తహతహ అనూరాధ సంస్కార హృదయం వెంటనే అర్థంచేసుకుంది. ఆమె కుమార్‌వైపు చూస్తూ అంది: “చూశావా కుమార్ ఇంక మీ అమ్మని నువ్వు కష్టపెట్టగూడదు. నువ్వు ఓ ఇంటివాడివై, ఇంటి బాధ్యత పూర్తిగా వహించిన ఇల్లాలితో, చక్కగా సంసారం దిద్దుకుంటూంటే నీ మాతృహృదయం ఎంతయినా ఆనందిస్తుంది. అంతకన్న మీ అమ్మగారికి కావలసినదేముంది? అన్నీ తెలిసినవాడివైయుండీ ఒకళ్ళచేత చెప్పించుకోడం నీవంటివాడికితగనిపని” అంటుండగా కుమార్ చేతులు కడుక్కుని మాట్లాడకుండా తిన్నగా మేడమెట్లెక్కిపోయాడు. అతని వెనకాలే నడిచింది అనూరాధ. తిన్నగామేడమెట్లెక్కి గదిలో మంచంమీద శరీరం వాలుస్తూ, అక్కడేవున్న కుర్చీ చూపించి ‘కూర్చో అనూ’ అన్నాడు. ఆ గదంతా ఒక్కసారి నాలుగువయిపులా కలయజూచింది అనురాధ. రెండు వాలుకుర్చీలూ, ఓ డ్రాయరూ, డ్రాయరుమీద కొన్ని పుస్తకాలూ, క్రింద రెండు చాపలూ, చాపలనిండా, సగంసగం రాసిన కాగితాలూ, పెన్సిళ్ళూ, కలాలూ, నానా చిందరవందరగా ఉంది. ఆమె గదిలోనివన్నీ సర్ది శుభ్రపరచింది. ‘చూశావ్ కుమార్, భార్యలేని నీ జీవితం అంతా ఈ గదిలోనే మూర్తీభవించి ఉంది’ అంది.

కుమార్ భారంగా ఓ నిట్టూర్పు విడిచి “నిజమే అనూరాధా, భార్య లేకపోవడం ప్రస్తుతంలో లోకానికి ఓ పెద్దలోటుగానే కనిపించినా, నామటుక్కుమాత్రం భార్యయొక్క ఆశా, అవసరం కూడా ఇక లేదన్న విషయం అతి ధైర్యంమీద చెపుతున్నాను. అనుకూలవతి అయిన భార్యా, తన భావాలతో ఏకీభవించగల భార్యా దొరకని వాడి జన్మ ఒట్టి శూన్యం నిస్సారం? ఏమంటావ్?” అన్నాడు.

ఆమె అతని మంచానికి జేరబడి అతని కళ్ళల్లోకి చూస్తూ, “కుమార్ నామాట విను. నిన్ను గురించి నేనెంతో ఊహాగానంచేశాను. ఏ పుణ్యాత్మురాలు నిన్ను భర్తగా పొంది, అమరసుఖం అనుభవిస్తూంటుందో అనుకున్నాను కాని తీయని నీ జీవితం అంతా వృధాచేసుకుంటున్నావ్? ఇంతకీ నీ ఉద్దేశం ఏమిటి? నాతో అయినా చెప్పు.”

“అనూరాధా! నాపెళ్ళిమాటకేంగాని, నీ భర్తా నువ్వూ అన్యోన్యంగా సంసారం దిద్దుకుంటూ, ఆదర్శజీవితం గడుపుతున్నారా? రాంచీలో ఎన్నాళ్ళున్నావ్? ఉత్తరహిందూస్థానంలో నువ్వు చూసిన వింతలూ; విశేషాలూ ఏమిటి?”

అనూరాధ బాధగా ఒక్క వేడినిట్టూర్పు విడిచి “కుమార్, నా జీవితం, యౌవనం అంతా, అడవిని గాచిన వెన్నెలయింది. నన్ను గురించి నువ్వేమో కలలుగని వుండొచ్చు. నేను నా భర్తతో ఎంతో ఆనందంగా సంసారసుఖం అనుభవిస్తున్నానని నీవు అనుకొని వుండవచ్చు. కాని నాసంసారం ఉక్కుగోడల కారాగారవాసమూ, నే నెదుర్కొనవలసిన అనేక దుర్భరసమస్యలూ, నీకు పూర్తిగా తెలియవ్.”

కుమార్ ఆమెకు బాగా దగ్గరగా జరిగి, 'దుర్భరసమస్యలాఏమిటవి?' అన్నాడు, ఆమె చెప్పసాగింది. "పెళ్లయిన వెంటనే నన్ను అత్తారింటికి పంపేరు. మా అమ్మ పోయిం తర్వాత, మానాన్నకి, కొన్నాళ్లకి కూనూరు ట్రాన్స్‌ఫర్ అయింది. నేనాయనతో రాంచీ వెళ్లిపొయ్యాను. ఇక్కడ మా పెత్తల్లి తప్ప నాకు నా అన్నవారెవరూ లేరు. ఆవిడ క్కూడా భర్తపోయాడు. పిల్లలు కూడా లేరు. ఆయన పోతూ పోతూ ఇంత తిండానికి లోటు లేకుండా చేసేపోయారు. పిల్లలులేనిదవడంవల్ల నేనంటే ఆమె కెంతో మమకారం. మా అమ్మలేని లోటు ఆవిడవల్ల నాకంతలా కనబడలేదనే చెప్పాలి. నేను నా భర్తతో రాంచీ వెళ్లేటప్పుడు మా పెత్తల్లి నన్నుగురించి మా ఆయనకెంతో చెప్పింది. తల్లిలేనిదనీ, ఎలా చూసుకుంటావో నీదే భారమనీ. ప్రొద్దున్నే పదిగంటలకి ఆఫీసుకువెళ్ళి సాయంత్రం ఆరు గంటలకి రావడం అలవాటు. ఇంట్లో నేనొక్కర్తనే బిక్కుమంటూ ఉండేదాన్ని. కొత్తలో మాత్రం, సాయంత్రానికల్లా, ఇంటికి చేరుకొన్నాక కాస్త ఆనందంగా గడచేది కాలం. కాని అక్కడి పరిస్థితులు నాకు సరిపడ్డదికాదు. అందువల్ల శరీరంలో రోగం కూడా యేర్పడింది. ఆయనకి వేళకి స్నానం, పానం, భోజనం, కాఫీ వగైరాలు, సమకూర్చడంతోటే, నాకాలం వెళ్ళేది. ఆఫీసు పనితో, ఆయనకాలం వెళ్ళేది. ఇంట్లో ఉన్నప్పుడయినా, ఆయన ముచ్చటగానూ, కలిసిగోరుతనంగానూ, ఏమీ మాట్లాడేవారుకారు. అది సరిగ్గా లేదనీ, ఇది బాగులేదనీ, ఏదో వంకతో నన్ను తిడుతూండేవారు. ఆయన మనస్తత్వానికి భయపడే నేను అనుక్షణమూ ఆయన అడుగులకు మడుగులొత్తుతూ ఉండేదాన్ని. అలా ఉంటోన్నా, నాకు పతిభక్తి లేదనీ, దేవుడూ దెయ్యం అక్కర్లేదనీ, సంసారంవిషయంలో శ్రద్ధలేదనీ నానా తిట్లూ తిట్టేవారు. తనకు నావల్ల సుఖంలేదనీ, నన్ను అహర్నిశమూ వేధిస్తూండేవారు. ఏ వారానికో పదిరోజులకో ఆయన కిష్టమైనప్పుడు మాత్రం, నా కిష్టంలేకపోయినా, నే నేస్థితిలోవున్నా నా శరీరాన్ని ఒక యంత్రంలా ఉపయోగించుకొనేవారు. క్రమంగా ఆయన ప్రవర్తన చూస్తున్నకొద్దీ, ఆయనయెడల నాకు గౌరవ భావం సన్నగిల్లింది. ఆయనకంటె హృదయశూన్యు డెవరూ మరి ఉండరనుకున్నాను. కొంతకాలానికి మా ఇద్దరి పరిస్థితీ ఎడముఖం పెడముఖంక్రింద మారింది. అంతటితో ఒకరిపై ఒకరికి ఏహ్యభావం కలిగింది. అంతటితో ఊరుకోక, "జ్ఞానమ్మ" అనే ఆఫీసు టైపిస్టు గరల్‌ని చేరదీశారు. క్రమంగా ఇంటికి రావడంకూడా మానేసి ఆమెతోనే గడిపేవారు. ఇంటిదగ్గిర ఒక్కర్తినీ ఏమైపోయానో అనిగాని, తిండిఅయినా తిన్నానో లేదో అనిగాని వారికి నిమిత్తంలేకుండాపోయింది. ఏ పదిహేనురోజులకో ఒక్కసారి ఇంటికివచ్చి నన్ను నాలుగు తిట్టిపోయేవారు. నాకు జీవితంమీదే విరక్తిపుట్టింది. సంసారం, భర్తా అంటే అసహ్యం కలిగింది. చేతికి దొరికిన రత్నాన్ని సద్వినియోగం చేసుకోలేక, నా జీవితాన్ని ధ్వంసంచేసి నన్ను పూర్తిగా సర్వనాశనం చేశారు. మనసుకు శాంతిలేక, శరీరమునకు సౌఖ్యము లేకపోవుటచే కుంగిపోయాను. ఆరోగ్యం పాడైపోయింది. ఆయన నన్నొంటరిగానే ఇక్కడికి పంపించారు. నాన్నగారు కూనూరులో ఉన్నారు, ఇక్కడ మాపెత్తల్లిను నువ్వు ఎరుగుదువుగా, ఈ నాలుగేళ్ళలోనూ ఒక్కరాత్రి కూడా నేను ఆనందంగా గడపలేదు. మానసికంగా, పురుషపరిష్వంగ సౌఖ్యంకోసం, నా శరీరంలోని ప్రతి జీవాణువూ, తహతహలాడేది. ఎన్నో వెన్నెలరాత్రులు ఒక్కర్తినీ, నిన్ను తలుచుకుంటూ, నీ జీవితాన్నిగురించి ఆలోచిస్తూ, నీభార్య ఎంత అదృష్టవంతురాలో అని ఊహాగానంచేస్తూ గడిపాను. గాని నువ్వు ఇంకా బ్రహ్మచర్యమే కొనసాగిస్తున్నావని అనుకోలేదు" అంటూ ముగించింది. ఆమెకళ్లు చెమ్మగిల్లినయ్. అతని హృదయం ద్రవీభూతం అయింది.

రెండునెలలు గడిచాయి. క్రమంగా అనూరాధ ఆరోగ్యం కోలుకుంది. ఆమె ముఖంలో ఏదోకొత్తఅందం తొంగిచూసింది. ఒకర్నొకరు కలుసుకొంటూ ఆప్యాయంగా కాలం గడిపారు. మంచికి చెడ్డ, చెడ్డకు మంచి ఈ విధంగానే భగవంతుడు జతచేస్తుంటాడు. ఎవరి అదృష్టం వారిది. దాన్నెవరూ మార్చలేరు.


## జీవానందరసాయనము

ఊరుపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్బలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్బలమైన గుహ్యావయవమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు బుతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

**ధనలక్ష్మి అండు కో., సౌకారుపేట పోస్టు, మదరాసు.**